సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 21 । మార్చి । 2025



బీసీ రిజర్వేషన్లు హర్షణీయం

బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదించడంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ర్యాలీలు నిర్వహించి సీఎం చిత్రపటానికి అభిషేకం చేశారు. IIIలో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర: 6:23	శని: 5:03

గరిష్ఠం/కనిష్ఠం
37.0 /24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా వడగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఆస్పత్రి పరిశీలించిన కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

లక్సెట్టిపేట: 'ఆస్పత్రి భవనం ప్రారంభమెప్పుడో' శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పందించారు. పనులను పరిశీలించిన ఆయన త్వరగా పూర్తి చేయాలని సూచించారు. త్వరలో ఆస్పత్రి ప్రారంభ తేదీని ప్రకటిస్తామని తెలిపారు. పనుల్లో నాణ్యతను పరిశీలించి ఆపరేషన్ థియేటర్, ఇతర ప్రదేశాలు పరిశీలించారు. మార్చురీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాని, టెండరు ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపడుతామని అన్నారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు



ఇళ్ల పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు కట్టి ఇవ్వడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలో పైలట్ గ్రామంగా ఎంపికైన కొత్తపేటలో 126 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. మండలంలోని మురిమడుగు గ్రామానికి చెందిన దుర్గం మధుమితకు రూ.4లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్(ఎల్ఓసీ) అందజేశారు. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసీఉల్లా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, మండల ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, మండల సీనియర్ నాయకులు సుభాష్‌రెడ్డి, మోహన్ రెడ్డి, మిక్కిలినేని రాజశేఖర్, ఇందయ్య, ఇసాక్, షాకీర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పిచ్చుకల రక్షణ పర్యావరణానికి మేలు



చిప్పల్లో నీళ్లు పోస్తున్న అటవీ సిబ్బంది

వేమనపల్లి: ఊరపిచ్చుకల సంరక్షణతో పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుందని నీల్వాయి రేంజ్ అధికారి అప్పలకొండ, డెప్యూటీ రేంజ్ అధికారి రూపేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం వద్ద జాతీయ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని చెట్ల కొమ్మలు, భవనాలపై, కార్యాలయాల ఆవరణలో మట్టి పాత్రల్లో నీళ్లు పోసే కార్యక్రమం చేపట్టారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో పిచ్చికలు నీరు, తిండికి అల్లాడుతున్నాయని అన్నారు. నీల్వాయి రేంజ్ పరిధిలోని 20 బీట్‌లలో సిబ్బంది మట్టిపాత్రలు చెట్లపై ఉంచి నీటితో నింపి పక్షుల కోసం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ ప్రమోద్‌కుమార్, ఒడ్డుగూడం ఎఫ్ఎస్ఓ బేగ్, కొత్తపల్లి ఎఫ్‌బీఓ సోఫియా, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి సందర్శన

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ జిల్లా కో ఆర్డినేటర్ ఏ.కోటేశ్వర్ గురువారం సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవల తీరును అడిగి తెలుసుకున్నారు. వార్డులు, ఓపీ, క్యాజువాలిటీ విభాగాలను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమారి, ఆర్ఎంవో డాక్టర్ మూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ జోస్పిన్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ పాల్గొన్నారు.

'ఒక దేశం.. ఒక ఎన్నిక'

మంచిర్యాలటౌన్: ఒక దేశం.. ఒక ఎన్నిక జరిగితే దేశం ఆర్థికంగా, బలమైన శక్తిగా అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి బోయిని హరికృష్ణ, జిల్లా కన్వీనర్ దుర్గం అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల అశోక్ వర్ధన్, రెడ్డిమల్ల అశోక్ పాల్గొన్నారు.

వృద్ధిలో ఊరట

- ఉమ్మడి జిల్లాలో క్రమంగా ఆర్థికవృద్ధి
- పెరుగుతున్న జీడీడీపీ, తలసరి ఆదాయం
- గత ఆర్థిక సర్వేతో పోలిస్తే తాజాగా కాస్త మెరుగు
- 'తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖ చిత్రం-2025'లో వెల్లడి



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సామాజిక, ఆర్థిక రంగాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రమంగా వృద్ధిలో పయనిస్తోంది. గతంతో పోలిస్తే మార్పు కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏటా బడ్జెట్ సందర్భంగా విడుదల చేసే సామాజిక ఆర్థిక ముఖచిత్రంలో ఈ విషయం స్పష్టమవుతోంది. గత 2024(2022–23) సర్వేతో తాజాగా విడుదల చేసిన ఆర్థిక సంవత్సరాల(2023–24)తో పోల్చి చూసినప్పుడు ఈ మార్పులు వెల్లడవుతున్నాయి. కానీ రాష్ట్రంలో 33జిల్లాలతో పోలిస్తే నాలుగు జిల్లాలు ఇంకా అనేక అంశాల్లో వృద్ధి సాధించాల్సి ఉంది.

రైతుల చేతిలో నాలుగు ఎకరాల్లోపే..

ఉమ్మడి జిల్లాలో భూ కమతాల సగటు చూస్తే గతేడాది, తాజా సర్వే ప్రకారం యధావిధిగా ఉన్నాయి. అంటే భూమి చేతులు మారుతున్నప్పటికీ రైతుల వద్ద ఉన్న భూమి అలాగే కొనసాగుతోంది. గత ఆర్థిక సర్వేలోనూ ఉమ్మడి జిల్లాల్లో సగటు కమతం ఆదిలాబాద్ జిల్లాలో గరిష్ఠం 3.78ఎకరాలు ఉండగా, కనిష్ఠంగా మంచిర్యాలలో 2.29ఎకరాలు ఉంది. ఈ జిల్లాలో జనాభా తక్కువ, భూ లభ్యత ఎక్కువ కావడంతో సగటులో ఎక్కువ వస్తోంది.

జిల్లాలో సగటు భూ కమతాలు (ఎకరాల్లో)

ఆదిలాబాద్	3.78
ఆసిఫాబాద్	1.39
నిర్మల్	2.47
మంచిర్యాల	2.29



రోడ్ల సాంద్రత పెరగాలి



ఏళ్లుగా ఇంకా రోడ్ల సాంద్రత మెరుగుపడడం లేదు. రాష్ట్రంలో ఆసిఫాబాద్, మంచిర్యాలలో రోడ్ల సాంద్రత తక్కువగానే ఉంది. గత ఆర్థిక సర్వేలోనూ ఇదే తీరుగా నమోదైంది.

జిల్లా	రోడ్ల సాంద్రత
ఆదిలాబాద్	71.0
నిర్మల్	71.3
ఆసిఫాబాద్	66.0
మంచిర్యాల	69.1

అడవుల విస్తరణ ఓకే

అడవుల విస్తరణలో ఉమ్మడి జిల్లా మెరుగ్గానే ఉంది. మొత్తం భూ భాగంలో మంచిర్యాలలో 41శాతం విస్తరించి ఉండగా, ఆదిలాబాద్‌లో 29.51శాతం ఉంది. రాష్ట్రంలో ములుగు 64.64శాతంతో జిల్లా మొదటి స్థానంలో ఉండగా, కరీంనగర్‌లో అత్యల్పంగా 2.29శాతమే ఉంది.

అటవీ విస్తరణ(శాతంలో)



జీడీడీపీ 2023-24(విలువ రూ.కోట్లలో)			గతేడాది (2022-23)
జిల్లా	జీడీడీపీ (ప్రస్తుత ధరల్లో)	ర్యాంకు	జీడీడీపీ (ప్రస్తుత ధరల్లో)
ఆదిలాబాద్	18,847	25	17,190
ఆసిఫాబాద్	13,700	31	11,136
నిర్మల్	19,774	23	16,956
మంచిర్యాల	22,094	20	21,395



జీడీడీపీలో మార్పు

జిల్లా భూభాగంలో జరిగిన అంతిమ వస్తు సేవల విలువగా పేర్కొనే స్థూల జిల్లా జాతీయ ఉత్పత్తి(జీడీడీపీ)లో గతేడాది కన్నా పెరిగింది. అయితే రాష్ట్ర స్థాయిలో 33జిల్లాల్లో ఉమ్మడి జిల్లా మొదటి పది స్థానాల్లో లేదు. ఇంకా ఈ ర్యాంకులు మెరుగుపడాల్సి ఉంది. అంటే స్థానికంగా ఉత్పాదక ఇంకా పెరగాల్సి ఉంది.

'తలసరి'లో మెరుగు

ఉమ్మడి జిల్లా పౌరుల తలసరి ఆదాయంలోనూ వృద్ధి కనిపిస్తోంది. జీడీడీపీని ఆదాయ ఆర్జన చేసే పౌరులతో భాగిస్తే వచ్చే తలసరి ఆదాయంలో ఇంకా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల కంటే వెనుకబడి ఉంది. అయితే నిర్మల్ జిల్లా తలసరి ఆదాయం పెరుగుతోంది.

తలసరి ఆదాయం 2023-24 (రూ.లో)			గతేడాది (2022-23)
జిల్లా	తలసరి	ర్యాంకు	తలసరి ఆదాయం
నిర్మల్	2,34,640	18	2,03,326
మంచిర్యాల	2,27,716	21	2,19,601
ఆదిలాబాద్	2,22,233	24	2,03,283
ఆసిఫాబాద్	2,21,456	25	1,81,825



విద్యుత్ వాడకం పైపైకి...



విద్యుత్ వాడకం పెరిగి, కనెక్షన్లలో స్వల్ప మార్పు కనిపిస్తోంది. తాజా ఆర్థిక సర్వే ప్రకారం గృహ వినియోగంతోపాటు వ్యవసాయ కనెక్షన్లు పెరుగుతున్నాయి.

ఉపాధితో హామీ



గ్రామీణులకు ఏడాదిలో కనీసం వంద రోజుల పని కల్పన లక్ష్యంగా కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లాలో పూర్తి స్థాయిలో లక్ష్యం చేరుకోవడం లేదు. నిర్ణయించుకున్న లక్ష్యం, ఉపాధి నమోదు, సాధించిన లక్ష్యంలో చేరువ కావడం లేదు. అయితే గతేడాది వందశాతంపైగా ఉమ్మడి జిల్లా సాధించింది.

పరిశ్రమలు



పరిశ్రమల స్థాపన, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన గతేడాది కంటే మెరుగు కనిపిస్తోంది. పెట్టుబడుదారులకు పలు అవకాశాలు కల్పించడంతో అవకాశాలు మెరుగుపడుతున్నాయి. అయితే మంచిర్యాల, నిర్మల్‌తో పోలిస్తే గిరిజన ప్రాంతాలైన ఆసిఫాబాద్, ఆదిలాబాద్‌లో పెట్టుబడుదారులు ముందుకు రావడం లేదు.

టీజీ ఐపాస్‌తో పెట్టుబడులు, ఉపాధి కల్పన

జిల్లా	యూనిట్లు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి
మంచిర్యాల	15	29.53	234
నిర్మల్	35	89.14	451
ఆదిలాబాద్	08	5.86	70
ఆసిఫాబాద్	07	3.42	74

విద్యుత్ కనెక్షన్లు (శాతంలో)

జిల్లా	గృహ	వ్యవసాయ	పరిశ్రమ	ఇతర
ఆసిఫాబాద్	80.8	7.9	0.4	10.8
ఆదిలాబాద్	75.7	11.8	0.5	11.9
మంచిర్యాల	74.1	13.5	0.5	11.9
నిర్మల్	68.1	20.8	0.4	10.6

అంతా సిద్ధం

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- విద్యార్థులు 9,198
- 49 పరీక్ష కేంద్రాలు
- సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ నంబర్లు 7032463114, 9440688034

మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల భవిష్యత్‌కు తొలిమెట్టుగా భావించే పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నేటి నుంచి వచ్చే నెల 4వరకు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ ఏడాది పరీక్షల్లో 24పేజీలతో కూడిన జవాబు పత్రం(ఆన్సర్ షీట్) ఇవ్వనున్నారు. పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. సౌకర్యాలపై సూచనలు చేశారు. గురువారం పాఠశాలల్లో విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బంది నిబంధనల ప్రకారం ప్రశ్నపత్రాలను స్టోరేజీ పాయింట్ల నుంచి తరలించాలని ఇదివరకే ఆదేశించారు. ప్రతీ కేంద్రం వద్ద సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెగ్యులర్ విద్యార్థులు 9,198మంది పరీక్షలకు హాజరు కానున్నారు. జీపీహెచ్ఎస్ 14 పాఠశాల నుంచి 382 మంది, బీసీడబ్ల్యూఆర్ఈఐ 7పాఠశాలల్లో 439మంది, ఏడు ప్రభుత్వ పాఠశాలల నుంచి 208మంది, 18 కేజీబీవీల్లో 642మంది, 101 స్థానిక సంస్థల పాఠశాలల నుంచి 2,815మంది, 80 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 3,346మంది పరీక్ష రాయనున్నారు. ఐదు టీఎస్ఎంఎస్‌ల నుంచి 445మంది, టీఎస్ఆర్ఎస్‌కు చెందిన 68మంది, 9టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌కు చెందిన 672మంది, రెండు ఎయిడెడ్ పాఠశాలల నుంచి 46మంది పరీక్షలకు హాజరు కానున్నారు. మొత్తంగా 4,730 మంది బాలురు, 4,468మంది బాలికలు, ఒక్కసారి పరీక్ష తప్పిన విద్యార్థులు 221 మంది ఉన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటు అధికారులు, సిట్టింగ్‌స్క్వాడ్‌లను 49మంది చొప్పున, 484మంది ఇన్విజిలేటర్లను, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు.



జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరిశీలిస్తున్న సీఎస్

ప్రశాంతంగా రాయండి

పరీక్షలను ప్రశాంతం రాయాలి. ఆత్మవిశ్వాసం, ధైర్యంగా పరీక్షలు రాయండి. సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురాకూడదు. విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లతోనూ పరీక్షలకు హాజరుకావచ్చు. పదో తరగతి వార్షిక పరీక్షల కోసం హెల్‌లైన్ ఏర్పాటు చేశారు. ఏవైనా సందేహాలు, సమాచారం కోసం సంప్రదించవచ్చు.

– యాదయ్య, డీఈవో

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం



ఎస్సీ వసతిగృహం వద్ద కుటుంబసభ్యులతో..



పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

- 97శాతం విద్యార్థులు హాజరు
- 167మంది గైర్హాజర్

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. ఈ నెల 5న పరీక్షలు ప్రారంభం కాగా.. ఈసారి ఒక్క విద్యార్థి కూడా డిబార్ కాకుండా పరీక్షలు సాఫీగా సాగాయి. చివరి రోజు ద్వితీయ సంవత్సరం పరీక్షకు 5,823 జనరల్ విద్యార్థులకు గాను 5,656 మంది(97శాతం) హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చోట్ల విద్యుత్, నీటి సౌకర్యం, టేబుళ్లు, రవాణా సౌకర్యం కల్పించారు. క్షణం తీరిక లేకుండా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు పరీక్షలు ముగియడంతో ఆనందంలో మునిగితేలారు. చిరుదరహాసాలతో వెళ్తూ సెల్ఫీలు తీసుకోవడం, టాటాలు చెప్పుకోవడం కనిపించింది. హాస్టళ్లలో చదువే లోకంగా ఉన్న విద్యార్థులు పరీక్షలు పూర్తి కావడంతో పెట్టె సర్దుకుని ఇంటి బాట పట్టారు.

22న స్పాట్ వాల్యూయేషన్

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన తెలుగు, హిందీ, ఇంగ్లిష్, పౌరశాస్త్రం, మ్యాథ్స్ జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల22న మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య తెలిపారు. స్పాట్ వాల్యూయేషన్ ఎగ్జామినర్‌గా నియామక ఉత్తర్వులు అందుకున్న ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ప్రభుత్వ, ప్రైవేట్ సాంఘిక సంక్షేమ, మహాత్మాజ్యోతిరావుపూలే, ఆదర్శ, కేజీబీవీ, మైనార్టీ జూనియర్ కళాశాల అధ్యాపకులను రిలీవ్ చేసి మూల్యాంకనానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పరీక్షలంటే భయం వద్దు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి: పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయం, ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. దండేపల్లి కేజీబీవీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. 'పరీక్షలకు అంతా సిద్ధం అయ్యారా.. బాగా రాస్తారు కదూ..' అంటూ ఆప్యాయంగా పలుకరించారు. అంతకు ముందు దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పాఠశాలలో శుక్రవారం నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం మండలంలోని నాగసముద్రం, మాకులపేట శివారులో పంట పొలాలను పరిశీలించారు. సాగునీరందక రైతులు పడే ఇబ్బందులపై తెలుసుకున్నారు. చివరి తడికి నీరందించేందుకు అధికారులతో మాట్లాడతానని భరోసా ఇచ్చారు. మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించారు. దండేపల్లి పీహెచ్‌సీలో వెళ్లి వైద్య సేవలపై ఆరా తీశారు. ఎంపీడీవో ప్రసాద్, డీటీ విజయ, ఎంఈవో చిన్నయ్య, ఏవో అంజిత్‌కుమార్, ఆర్ఐ భూమన్న పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

బెల్లంపల్లి: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించనున్నట్లు డీఈవో ఎస్.యాదయ్య తెలిపారు. గురువారం బెల్లంపల్లి బజారు ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంక్షేమ బాలుర గురుకుల సీవోఈ విద్యాలయం, సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెయింట్ మేరీస్ పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సమర్థవంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వేసవి కాలం దృష్ట్యా పరీక్ష కేంద్రం వద్ద ఏఎన్ఎం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతామని వివరించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మండల విద్యాధికారి పోచయ్య, క్లస్టర్ నోడల్ అధికారి మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- అదనపు కలెక్టర్ మోతీలాల్
- ఘనంగా మహిళా దినోత్సవ వారోత్సవాల ముగింపు

కాసిపేట: కుటుంబాన్ని తీర్చిదిద్దడంతోపాటు దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమైనదని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో జిల్లా వయోజన విద్య, సఖి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటల పోటీల్లో విజేతలైన మహిళలకు బహుమతులు అందజేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఆత్మస్థైర్యమే గొప్ప ఆయుధమని, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మండలాన్ని వంద శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దేందుకు బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో మహిళల పాత్ర అధికంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి, సఖి లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు బండ శాంకరి, డీఆర్పీలు సుమన్, అశోక్ రావు, అక్షర వాలంటీర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న మోతీలాల్

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

బెల్లంపల్లి: భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ అన్నారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏసీపీ రవికుమార్, భూ సమస్యల పరిష్కార వేదిక మండల స్థాయి కమిటీ అధికారులతో బెల్లంపల్లి సబ్ డివి జన్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా భూ దరఖాస్తులు, వాటి పురోగతి, ఇప్పటివరకు పరిష్కరించిన వాటి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 34 దరఖాస్తులు రాగా, 14 మండల స్థాయిలో పరిష్కరించామని, సబ్ డివిజన్ స్థాయి కమిటీకి 4 సిఫారసు చేయగా, మరో 16 నిర్ణీత 21రోజుల గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మండలాల వారీగా ప్రభుత్వ శాఖల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశారని వివరించారు. రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ కే.శ్రీనివాసరావు, ఏడు మండలాల తహసీల్దార్లు, ఎస్సైలు, ఎంపీవోలు పాల్గొన్నారు.



సమీక్షలో ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్

ముగిసిన క్రీడలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహిస్తున్న ఫెస్ట్ 2.0లో వైద్య విద్యార్థుల క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, చెస్, క్యారమ్ క్రీడలు గురువారం ముగిశాయి. ఫైనల్ పోటీల్లో బాలురు, బాలికల జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. ఈ నెల 21నుంచి 24వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలను కళాశాలలో నిర్వహించనున్నారు. 300 మంది వైద్య విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.



వాలీబాల్ పోటీల్లో విజేతల ఆనందం

పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలి

పాతమంచిర్యాల: పార్లమెంటు సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో బీసీ నాయకులతో కలిసి లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో ప్రాతినిధ్యం వహిస్తున్న 32రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్‌కు అనుకూలంగా కేంద్రానికి లేఖలు సమర్పించాయని, తొమ్మిది అసెంబ్లీల్లో తీర్మానాలు చేసి పంపించాయని తెలిపారు. నాయకులు డాక్టర్ రఘునందన్, భీంసేన్, బండ సతీష్, అక్కల రమేష్, అంకం సతీష్, అరేందుల రాజేశం, మల్లేష్, పెద్దాల చంద్రకాంత్, శంకర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహం అడ్డగింత



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేరడిగొండ(బోథ్): మండలంలోని బొందిడి గ్రామంలో గురువారం అధికారులు బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థినికి అదే గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి చేయాలని పెద్దలు నిశ్చయించారు. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంజుల జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ హెల్ప్‌లైన్ సహకారంతో గ్రామానికి వెళ్లి వివాహాన్ని అడ్డుకున్నారు. గ్రామస్తులకు చైల్డ్ మ్యారేజ్ ప్రొబిషన్ యాక్ట్ గురించి వివరించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్, పీహెచ్‌సీ స్వామి, సోషల్ వర్కర్ రవికాంత్, అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



రాజలింగు (ఫైల్)

తాంసి(బోథ్): మండలంలోని కప్పర్లలో ఈ నెల 18న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన జీపీ కార్మికుడు సలగంటి రాజలింగు (53) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 18న ఇంటివద్ద మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని ఎస్సై రాధిక పరిశీలించారు. మృతుని భార్య దేవత ఫి ర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 20 క్వింటాళ్ల బియ్యం తరలిస్తూ పట్టుబడిన నలుగురిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ కాజల్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ డీలర్ కిష్టయ్య, వాహన డ్రైవర్ ఠాకూర్ అరుణ్‌సింగ్, ఠాకూర్ దారాసింగ్, గ్యాన్ సింగ్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

అసభ్యకర పోస్ట్ చేసిన ఒకరిపై..

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ట్విట్టర్‌లో అసభ్యకర పోస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి 'గంపుమేస్త్రి ఆర్‌ఆర్' ఐడీతో పోస్టు చేయగా పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన బుర్ల శంకరయ్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అడవులతోనే మనుగడ

రోజురోజుకూ పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, కొత్తగా పుట్టుకొస్తున్న వ్యాధులు, వైరస్‌లు, వీటికి కారణం అంతరిస్తున్న పచ్చదనం. జీవ వైవిధ్యంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న అడవులు నేడు అంతరించి పోయే ప్రమాదంలో పడ్డాయి. అడవులు అంతరిస్తే వాతావరణంలో కాలుష్యం పెరిగి సూర్యుని నుంచి వెలువడే ప్రమాదకరమైన అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిపై పడి మానవుని మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అడవులు అంతరించిపోకుండా కాపాడుకోవడం మనందరి బాధ్యత. నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం సందర్భంగా 'సాక్షి'కథనం.

- అటవీ సంపద అంతరిస్తే అనర్థమే..
- అడవుల పరిరక్షణ అందరి బాధ్యత
- నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని దట్టమైన అడవి

జన్నారం(ఖానాపూర్): తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి ఆదిలాబాద్‌కు అడవుల జిల్లాగా పేరుంది. 1965 నుంచి దట్టమైన అటవీ ప్రాంతంగా ప్రకటించారు. 1972లో ఈ ప్రాంతానికి వన్యప్రాణుల సంరక్షణ చట్టం తీసుకువచ్చారు. 1999లో ఈ ప్రాంతాన్ని రక్షిత ప్రదేశంగా ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో అడవి విస్తీర్ణం 2015.44 స్క్వేర్ కిలోమీటర్లు వ్యాపించి ఉంది. దట్టమైన అడవులు, పులుల ఆవాసాలకు అనుగుణంగా ఉండడంతో ఈ ప్రాంతాన్ని 2012 ఏప్రిల్ 10న కవ్వాల్ టైగర్‌జోన్‌గా ఏర్పాటు చేయగా కేంద్ర ప్రభుత్వం దేశంలో 42వ టైగర్‌జోన్‌గా గుర్తించింది. కవ్వాల్ టైగర్‌జోన్ దట్టమైన అడవులు, జంతువులు, పక్షులు, సరిసృపాల ఆవాసానికి చిరునామా. ఇందులో 893 స్క్వేర్ కిలోమీటర్లు కోర్ ఏరియాగా, 1123 స్క్వేర్ కిలోమీటర్లు బఫర్ ఏరియాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

జీవవైవిధ్యంలో అడవులు ముఖ్యపాత్ర

మానవ మనుగడకు దోహదపడే అడవులు జీవవైవిధ్యంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. పక్షులు, జంతువులు, వివిధ రకాల కీటకాలకు ఆవాసాలుగా మారిన అడవులు అంతరించిపోతే అనర్థాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయి. పిచ్చుకలు అంతరించిపోవడం వల్ల మిడుతలు వచ్చినట్లు, అడవులు అంతరిస్తే కరోనా లాంటి కొత్త వైరస్‌లు పుట్టుకొస్తాయి. ప్రాణకోటికి ఆవాసంగా ఉన్న అడవుల రక్షణ అత్యంత అవసరం. అడవులు బ్యాలెన్స్ తప్పితే వాటిపై ఆధారపడి జీవించే జీవులపై ప్రభావంపడి అనర్థాలకు దారితీసే ప్రమాదం ఉంది. అందుకే అడవుల రక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలి. అడవుల వల్ల సకాలంలో వర్షాలు కురిసి రైతులు సాగుచేసిన పంటలకు దోహదం చేస్తాయి. అడవులు బ్యాలెన్స్ తప్పితే కాలంలో మార్పులు చోటు చేసుకుంటాయి.

పెరిగిన అడవుల శాతం

గతంతో పోలిస్తే కవ్వాల్ టైగర్‌జోన్ ప్రాంతంలో అడవుల శాతం పెరిగింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు పోడు వ్యవసాయం, స్మగ్లింగ్ కోసం అడవులు నరికివేతకు గురయ్యాయి. 2016 అక్టోబర్‌కు ముందు కవ్వాల్ టైగర్‌జోన్‌లో అడవుల శాతం 21కి పడిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక ఈ విషయాన్ని గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అడవుల శాతం, పచ్చదనాన్ని పెంచడానికి హరితహారం పథకం ప్రవేశపెట్టి అడవుల్లో మొక్కలు నాటించారు. ఈ క్రమంలో టైగర్‌జోన్‌లో అడవుల శాతం 21 నుంచి 33కు పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

రక్షణలో ఆదర్శం

కవ్వాల్ టైగర్ జోన్ అడవుల రక్షణలో ఆదర్శంగా నిలుస్తోంది. కవ్వాల్ టైగర్ జోన్‌లో 14శాతం (275 స్క్వేర్ కిలోమీటర్లు) ఉన్న అడవిని రక్షించడానికి అధికారులు పలు విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఎఫ్‌డీవో పనిచేసిన మాధవరావు జన్నారం రేంజ్‌లో 4.5 వేల ఎకరాలు, తాళ్లపేట రేంజ్‌లో 2 వేల ఎకరాలు, ఇందన్‌పల్లి రేంజ్‌లో 3.5 వేల ఎకరాల స్థలం కేటాయించి పశువులు అందులోనే మేపేలా చర్యలు తీసుకున్నారు. గిరిజనులు అడవులపై ఆధారపడకుండా వారికి ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కల్పించారు.

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో అడవుల శాతం పెరగడం శుభపరిణామం. అడవులను రక్షించుకోకుంటే భవిష్యత్ తరాలకు ఇబ్బంది ఏర్పడుతుంది. వాతావరణం బ్యాలెన్స్ తప్పి అనర్థాలు ఏర్పడుతాయి. అడవుల రక్షణపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అడవుల రక్షణ అందరు బాధ్యతగా తీసుకోవాలి.

– శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి

రూ.21 లక్షలు పలికిన స్విమ్మింగ్‌పూల్



టెండర్ నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీర్ పేరి రాజు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గల స్విమ్మింగ్‌పూల్‌కు రికార్డుస్థాయి ధర పలికింది. గురువారం ఖరారు చేసిన టెండర్లలో ఆదిలాబాద్ పట్టణం దుర్గానగర్‌కు చెందిన జబాడే రాష్ట్రపాల్ అత్యధికంగా రూ.21లక్షలు బిడ్ దాఖలు చేసి దక్కించుకున్నారు. 2025–26 సంవత్సరానికి గానూ స్విమ్మింగ్‌పూల్ నిర్వహణకు ఈ నెల 15 వరకు మున్సిపల్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. ఆఫ్‌లైన్‌లో ఆరుగురు కాంట్రాక్టర్లు టెండర్లను దాఖలు చేయగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సీవీఎన్. రాజు ఆధ్వర్యంలో రూ.10,89,500 ప్రారంభ ధరతో టెండర్లు ఆహ్వానించగా రాష్ట్రపాల్ అనే కాంట్రాక్టర్ అత్యధికంగా రూ.21లక్షలు కోట్ చేశారు. రెండోస్థానంలో ప్రశాంత్ అనే కాంట్రాక్టర్ రూ.16.20 లక్షలు బిడ్ చేశాడు. అత్యధిక ధరకు కోట్ చేసిన వ్యక్తికి స్విమ్మింగ్‌పూల్‌ను అప్పగిస్తూ టెండర్ ఖరారు చేశారు. నివేదికను కలెక్టర్ రాజర్షిషాకు పంపించి త్వరలోనే నూతన కాంట్రాక్టర్‌కు స్విమ్మింగ్‌పూల్ నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నట్లుగా మున్సిపల్ ఇంజినీర్ పేరి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేడియం సూపరింటెండెంట్ రఫీ, మసూద్, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌టెన్షన్ గ్రేడ్–1 ఉద్యోగానికి ఎంపిక



సంహితరాజ్

బెల్లంపల్లి: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం విడుదల చేసిన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఎక్స్‌టెన్షన్ గ్రేడ్–1 (సూపర్ వైజర్)పరీక్ష ఫలితాల్లో బెల్లంపల్లికి చెందిన సంహిత రాజ్ సత్తా చాటింది. రాష్ట్రస్థాయిలో 21 ర్యాంక్, జోనల్ స్థాయిలో 4వ ర్యాంకు సాధించింది. పట్టణంలోని జీఎం కాలనీలో నివాసం ఉంటున్న కారంపూడి శ్రీనివాసరాజు–కృష్ణవేణి దంపతుల కుమార్తె అయిన సంహితరాజ్ గత నవంబర్‌లో వెలువడిన గ్రూప్–4 పరీక్ష ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎన్నికై బెల్లంపల్లి మైనార్టీ బాలికల గురుకుల కళాశాలలో విధులు నిర్వహిస్తోంది. అంతటితో ఆగకుండా రోజుకు గరిష్టంగా 10 గంటల పాటు చదివి జనవరి 6, 7 తేదీల్లో నిర్వహించిన పరీక్షకు హాజరై ఎక్స్‌టెన్షన్ గ్రేడ్–1 ఉద్యోగానికి ఎంపికైంది. తల్లి కృష్ణ బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, తండ్రి శ్రీనివాసరాజు శాంతిఖనిగనిలో డెప్యూటీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీనివాసరాజు కుమారుడు గత డిసెంబర్‌లో ప్రకటించిన సింగరేణి మేనేజ్‌మెంట్ ట్రెయినీ(అండర్ మేనేజర్)ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

కాసిపేట గనిపై అస్వస్థతకు గురైన కార్మికుడు



కార్మికుడిని పరామర్శిస్తున్న దేవి భూమయ్య

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కాసిపేట 1గనిపై గురువారం శశికాంత్ అనే రూఫ్ లేసర్ కార్మికుడు ఫ్రీ షిఫ్టు, మొదటి షిఫ్టు విధులు నిర్వహించి కళ్లు తిరిగి పడిపోయాడు. తోటి కార్మికుల కథనం ప్రకారం శశికాంత్ ఉదయం 5 గంటలకు ఫ్రీ షిఫ్టు విధులకు హాజరయ్యాడు. గనిలో తెగిపోయిన తాడును జాయింట్ చేసే పనిలో నిమగ్నంకాగా పని పూర్తికాక పోవడంతో అధికారుల ఒత్తిడి మేరకు మొదటి షిఫ్టు విధులు కూడా నిర్వర్తించాడు. మధ్యాహ్నం రెండున్నర గంటలకు గనిపైకి రాగా కళ్లు తిరిగి పడిపోయాడు. తోటి కార్మికులు ముందుగా మందమర్రి డిస్పెన్సరీకి, అక్కడి నుంచి రామకృష్ణాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అదనంగా షిఫ్టు నిర్వహించే కార్మికుడికి కనీసం టిఫిన్, పండ్లు, భోజనం ఏదైనా పంపించాల్సి ఉండగా అలా చేయకపోవడంతో ఈ సంఘటన జరిగినట్లు ఆరోపిస్తున్నారు.

అధికారుల ఒత్తిడే కారణం

కార్మికునికి ఇలా కావడానికి అధికారుల ఒత్తిడే కారణమని ఐఎన్టీయూసీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేవి భూమయ్య విమర్శించారు. గురువారం రాత్రి కార్మికుడిని పరామర్శించారు. గుర్తింపుసంఘం ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దా గం మల్లేశ్ మాట్లాడుతూ అధికారుల ఒత్తిడి కారణంగానే కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

మిలిటరీ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

కాసిపేట: రాష్ట్రీయ మిలిటరీ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వరస్వామి తెలిపారు. రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్ డెహ్రాడూన్‌లో చేరాలనుకునే విద్యార్థులు జనవరి 1, 2026 నాటికి 8వ తరగతి చదివే విద్యార్థులు అర్హులన్నారు. జూన్1న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'విద్యానిధి'కి దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం 2025 విద్యా సంవత్సరానికి గానూ జిల్లాలోని ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏదేని నాలుగేళ్ల డిగ్రీ చదివిన, చివరి సంవత్సరం చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ విద్యార్థులు అమెరికా, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్‌కొరియా తదితర దేశాల్లో ఉన్నత చదువుల కోసం వెళ్లేందుకు ఈ వకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు మే 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కలెక్టరేట్ భవన సముదాయంలో గల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దుప్పిపై కుక్కల దాడి

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్‌రూం కాలనీ సమీపంలో గురువారం అటవీ ప్రాంతం నుంచి నీటి కోసం వచ్చిన దుప్పిని కు క్కలు వెంబడించి గాయపరిచాయి. దీంతో గమనించిన కాలనీ వాసులు దుప్పిని కాపా డి అటవీ శాఖ అధికారులకు అప్పగించా రు. చికిత్స అందించి తిరిగి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టామని ఎఫ్ఆర్‌వో కిరణ్ తెలిపారు.

- యూట్యూబ్‌లో చూసి లాకర్ తెరిచి దొంగతనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: దొంగలు రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతున్నారు. టెక్నాలజీని ఉపయోగించి చోరీలకు పాల్పడుతున్నారు. మూడు రోజుల క్రితం ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్‌లో గల నేషనల్ మార్ట్‌లో కటింగ్ గ్రైండర్‌తో ఓ దొంగ లాకర్‌ను పగలగొట్టి చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. తాజాగా ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీలో ఓ మహిళ యూట్యూబ్‌లో చూసి గోద్రేజ్ లాకర్‌ను ఓపెన్ చేసి అందులో ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లింది. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన జాబు తిరుపతి ఈనెల 17న తన ఇంట్లో ఉన్న

మాయ 'లేడీ'



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

గోద్రేజ్ లాకర్‌లో భద్రపర్చిన ఆభరణాలు తెరిచి చూశాడు. అందులో ఉన్న రెండు తులాల బ్రాస్‌లెట్, తులంనర చొప్పున ఉన్న రెండు చైన్లు కనిపించకపోవడంతో టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు. తిరుపతి ఇంట్లో పనిచేస్తున్న ప్రకాశం జిల్లాకు చెందిన కోట మమతను విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకుంది. హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్ పాషా వెల్డింగ్ పనిచేస్తున్నాడు. వీరిద్దరికి హైదరాబాద్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో పనిచేసినప్పుడు పరిచయం ఉంది. పనిచేస్తున్న ఇంట్లో చోరీకి పాల్పడాలని సూచించాడు. తాను పనిచేస్తున్న ఇంట్లో గోద్రేజ్ లాకర్‌కు డిజిటల్ కీ ఉందని చెప్పడంతో సయ్యద్ ఇర్ఫాన్ యూట్యూబ్‌లో చూసి పాస్‌వర్డ్ కొట్టమని చెప్పాడు. ప్రయత్నించగా లాకర్ ఓపెన్ కావడంతో అందులో ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లింది. ఇర్ఫాన్‌ను పిలిచి రెండు తులాల చైన్ అప్పగించగా హైదరాబాద్‌లో విక్రయించాడు. గురువారం ఆదిలాబాద్ బస్టాండ్‌కు మరోసారి బంగారాన్ని తీసుకెళ్లి విక్రయించేందుకు వచ్చిన ఆయనను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు తులాల బ్రాస్‌లెట్, 13 గ్రాముల చైన్, రూ.45వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకున్న ఆదిలాబాద్ టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, ఎస్సై విష్ణుప్రకాష్, ఐడీ పార్టీ కానిస్టేబుల్ బొట్టు రమేశ్, బబిత, రుక్మారెడ్డిలను డీఎస్పీ అభినందించారు.

నేడు, రేపు ఉమ్మడి జిల్లాకు వర్షసూచన

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నేడు, రేపు రెండు రోజులపాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో పాటు వడగళ్లతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు సూచిస్తున్నారు. వారం రోజులుగా ఎండలు మండిపోతుండగా గురువారం జిల్లాలో కాస్తా మబ్బుపట్టి ఉంది. శుక్ర, శనివారాల్లో వర్షంతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. పంట పొలాలకు వెళ్లే రైతులు, పశువుల కాపర్లు చెట్ల కింద నిల్చోరాదన్నారు. కోసిన పంటలను ముందస్తుగా సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. మార్కెట్‌కు తరలించిన ధాన్యం తడవకుండా టార్పాలిన్‌తో కప్పి ఉంచాలన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న కూరగాయలు ముందస్తుగా కోసుకోవాలని, పురుగు మందుల పిచికారీ తాత్కాలికంగా నిలిపివేయాలని సూచించారు.

విద్యార్థి అదృశ్యం



రాకేష్ (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి గురువారం అదృశ్యమయ్యాడు. బేల మండలంలోని గణేశ్‌పూర్‌కు చెందిన మడావి రాకేష్ ఆదిలాబాద్ పట్టణంలోని గోపాలకృష్ణ విద్యామందిర్‌లో ఐదోతరగతి చదువుతున్నాడు. వసతిగృహంలో ఉంటూ విద్యాబోధన చేస్తున్నాడు. ఇంటర్వెల్ సమయంలో విద్యార్థి కనిపించకుండా పోవడంతో ప్రిన్సిపాల్ మాధవ్‌రావు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

అక్షరంతో సామాజిక చైతన్యం!



తెలంగాణ రచయితల వేదిక జిల్లా కవులు (ఫైల్)

సున్నిత హాస్యం, వ్యంగ్యం, విమర్శ, ఎత్తిపొడుపు, నీతి, స్ఫూర్తి కీర్తి, మరేదైనా కవి కలంలో అక్షరాలుగా ఒదిగి పోవాల్సిందే... జిల్లాకున్న చారిత్రక నేపథ్యంలో సాహిత్యానికి మిక్కిలి ప్రాధాన్యత ఉంది. కవిత్వం గురించి ఎంత చెప్పుకున్నా కవితాభిమానులకు తీరే దాహం కాదది. వాక్కు పుట్టినప్పుడే కవిత్వమూ పుట్టి ఉంటుంది. కవిత్వంలేని భాష లేదు.. కవిత్వానికి అందని భావమూ లేదు. కవిత్వాన్ని సంక్షిప్తంగా చవిచూపడానికి ఒక్క పదునైన వాక్యమైనా సరిపోతుంది.

- సాహితీఖిల్లాగా విరాజిల్లుతున్న నిర్మల్
- సాహితీవేత్తలు, కళాకారులకు పుట్టినిల్లు
- నేడు ప్రపంచ కవితా దినోత్సవం

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా అనగానే మొదట గుర్తుకు వచ్చేది కవులు, కళాకారులే.. సాహితీపరంగా చారిత్రక నేపథ్యం ఉన్న నిర్మల్ సాహితీ జిల్లాగా పేరు గాంచింది. ఇప్పటికే ఇక్కడి నుంచి వందలాది మంది కవులు, రచయితలు సాహితీ రంగంలో తమదైన ప్రతిభ చాటుతున్నారు. జిల్లాలో తొలితరం కవుల నుండి మొదలుకొని ప్రస్తుతం ఉన్న పద్యకవులు, వచన కవులు, కళాకారులు సాహితీవేత్తల వరకు కొదువలేదు. ప్రాచీన కవులు బోయ ధర్మయ్య, మామడ మునిపంతులు, పొన్నకంటి రాజయ్య నేటితరాన్ని ప్రభావితం చేసిన మడిపల్లి భద్రయ్య ఉన్నారు. ఆధునిక కవులలో ప్రస్తుతం బొందిడి పురుషోత్తం, నేరెళ్ల హన్మంతు, వెంకట్, చక్రధారి, దామెర రాములు, పత్తి శివప్రసాద్, తుమ్మల దేవరావు, కరిపె రాజ్‌కుమార్, పుండలీక్‌రావు, పోలీస్ భీమేష్, కృష్ణంరాజు, కామారపు జగదీశ్వర్, అబ్బిడి రాజేశ్వర్ రెడ్డి, తాడిశెట్టి పరమేశ్వర్.. ఇలా మరెందరో కవులు, రచయితలు తమ రచనలతో సామాజిక చైతన్య ప్రతీకలుగా కొనసాగుతున్నారు. నేడు ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు కవుల అభిప్రాయాలు.

సమాజమంతా కవిత్వం మిళితమై...



సమాజమంతా కవిత్వం మిళితమై ఉంటుంది. కవిత్వం లేని సమాజం ఊహించలేం. సమాజాన్ని చైతన్యవంతం చేయడమే కవిత్వం పని. పల్లె పదాలతో అల్లుకున్న కవిత్వపు పాట ప్రజల నాలుకలపై సజీవంగా నడయాడుతుంది. ఆహ్లాద జీవితానికి కవిత్వం దోహదపడుతుంది. ఇప్పటికీ గ్రామీణ జన బాహుళ్యంలో పాటలు, కోలాటాలు, బతుకమ్మ, భజన పాటలతో సమాజాన్ని చైతన్య పరుస్తోంది కవిత్వమే.

– తుమ్మల దేవరావు, సాహితీవేత్త, చరిత్రకారుడు, నిర్మల్

కవిత్వం నిత్యాన్వేషణ..



'ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక...' అన్న వాక్కులు అక్షర సత్యాలు. ప్రపంచం నిండా కవిత్వం నిబిడీకృతమై ఉంది. జీవితానికి, జీవన అనుభవానికి ఆలంబన కవిత్వమే. సంక్లిష్ట సమాజాన్ని అర్థం చేసుకోవడానికి, నిద్రాణమైన జాతిని, మనిషిని మేల్కొల్పడానికి సరైన సాధనం కవిత్వమే. 'కవియాత్ర' పేరిట వర్ధమాన కవులను ప్రోత్సహించే నావంతు చిరు ప్రయత్నం చేస్తున్నా.

– కారం శంకర్, 'కవియాత్ర' జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు, నిర్మల్

హృదయంలోని భావోద్వేగమే..



మనిషి అంతర్మథనం లోంచి, సామాజిక పరిశీలన, జీవితాల అనుశీలన నుంచి వచ్చిన ఒక భావోద్వేగమే కవిత్వం. సామాజిక చైతన్యానికి ఆనవాళ్లుగా నిలిచేది, సమాజాన్ని మేల్కొలిపేది, మనస్సుల్లో మానసిక పరివర్తనను కలిగించేది కవిత్వమే. నేటితరానికి అనుగుణంగా వ్యవహారిక భాషలో వచ్చే కవిత్వాన్ని ప్రజానీకం ఆస్వాదించే ప్రయత్నం చేస్తున్నారు. దానికనుగుణంగా కవులు తమ కవితారచనలు చేస్తూ సాహితీసేవలో తరిస్తున్నారు.

– పత్తి శివప్రసాద్, కవి, రచయిత, నిర్మల్

ఆర్జీయూకేటీలో ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్



విద్యార్థులతో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర(ముధోల్): బాసరలోని ఆర్జీయూకేటీలో గురువారం 'ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్' యూత్ ట్రాన్స్‌ఫర్మేషన్ మిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. కేఎల్‌ఆర్ ఇండస్ట్రీస్ యజమాని కే.లక్ష్మీరెడ్డి మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు పరిశ్రమల సందర్శనకు అవకాశం కల్పిస్తామనడం, శిక్షణ, ఇంటర్న్‌షిప్ కూడా అందిస్తామనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధర్షన్, ఏవో శ్రీరణధీర్ సాగి, అసోసియేట్ డీన్ అకాడమిక్ అండ్ ప్లానింగ్ డాక్టర్ చంద్రశేఖరరావు, అసోసియేట్ డీన్ ఇంజినీరింగ్ డాక్టర్ కె. మహేష్, అసోసియేట్ డీన్ సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్ డాక్టర్ విట్టల్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెక్ ఫెస్ట్ 2025

బాసర: బాసర ఆర్జీయూకేటీలో నేటి నుంచి మూడు రోజుల పాటు టెక్‌ఫెస్ట్ 2025 'అంతఃప్రజ్ఞ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎ.గోవర్ధన్ తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ఇంజినీరింగ్ విభాగాల నుండి విద్యార్థుల వినూత్న ఆలోచనలు, ప్రాజెక్టులు ప్రదర్శిస్తారన్నారు. మానవీయ శాస్త్రాలు, సామాజిక శాస్త్ర విభాగాల నుండి హ్యాకథాన్‌లు, కోడింగ్ పోటీలు రోబోటిక్స్ సవాళ్లు వంటి ఇతర కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధరన్, ఏవో రణధీర్ సాగి, అసోసియేట్ డీన్స్ డాక్టర్ మహేశ్, డాక్టర్ విట్టల్, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ ఆర్.అజయ్, స్వప్నిల్, ప్రకాష్, డాక్టర్ రాములు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి ప్రాణాలు కాపాడిన బాసర పోలీసులు



సుమలతను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎస్సై

బాసర: నిర్మల్ జిల్లా బాసర గోదావరినది వద్ద గురువారం ఆత్మహత్యకు యత్నించిన వేర్వేరు కుటుంబాలకు చెందిన ఇద్దరి ప్రాణాలు కాపాడిన పోలీసులను పలువురు అభినందించారు. నిజామాబాద్ జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన తిరుమనపల్లి సంపత్ గోదావరిలో దూకేందుకు యత్నిస్తుండగా విధి నిర్వహణలో అటుగా వెళ్తున్న పోలీసులు గమనించి అతన్ని రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన కొమ్ము సుమలత గోదావరిలో దూకేందుకు ప్రయత్నిస్తుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళను పోలీస్ స్టేషన్‌కు తరలించడంతో ఎస్సై గణేశ్ ఆమెకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.